


## అధునాతన హంగులతో

# వికేర్ హాస్పటల్

## మహానగరాలకు దీటుగా వైద్య సదుపాయాలు...

- అతి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంచాలి
- కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా వికేర్ మల్టీస్ స్పెషలిస్ట్ హాస్పిటల్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే వనమా



**శామ్, జనవరి29(కెరటం ప్రతినిధి)**

మహానగరాలకు ధీటుగా వైద్య సదుపాయాలు అందించాలని, అతి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంచాలని, అధునాతన హంగులతో ఏర్పాటు చేసిన వీ-కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మంచి పేరుప్రఖ్యాతలు పొందాలని కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని మోరేడు బ్రిడ్జి వద్ద 'వి కేర్' మల్టీస్ స్పెషలిస్ట్ హాస్పిటల్ అట్టహాసంగా ఆదివారం ప్రారంభమైంది. ఈ హాస్పటల్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన వైద్య సదుపాయాలు అతి సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉంచాలని, పేదలకు, మధ్యతరగతి ప్రజానికానికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని సకల హంగులతో హాస్పటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహానగరాలకు ధీటుగా వి కేర్ హాస్పిటల్ నెలకొల్పడం పట్ల హాస్పటల్ అధినేత డాక్టర్ మహమూద్ పాషను ఎమ్మెల్యే వనమా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, పట్టణ సీనియర్ వైద్యులు డాక్టర్ ఏ.నాగరాజు, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, డైరెక్టర్లు యాకూబ్, జానీ, శేషాద్రి వినోద్, రైతు సమన్వయ కమిటీ సభ్యులు కృష్ణార్జునరావు, అజయ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వి కేర్ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.






## అదానీ ఆర్థిక అరాచకం వెనుక మోడీ

- రాజ్యాంగంలోకి మనువాదాన్ని చొప్పించే కుట్ర
- అనవసర కేసులు నమోదు చేస్తే ప్రతిఘటన తప్పదు
- పొత్తు పొత్తే - పోరాటం పోరాటమే
- మీడియా సమావేశంలో కూనంనేని

**ఖమ్మం, కెరటం న్యూస్**

భారతదేశంలో అనతికాలంలోనే ఆర్థికంగా ఎదిగి ఆర్థిక అరాచకం సృష్టిస్తున్న అదానీ వెనుక ప్రధాని మోడీ ఉన్నారని మొత్తం అదానీ వ్యవహారానికి సంబంధించి విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ధనాన్ని అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టేలా మోడీ ప్రోత్సాహించారని అదానీని అరెస్టు చేసి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ అదానీ సంపాదన, ఆర్థిక ఎదుగుదల అంతా డొల్ల అని తేలిపోయిందని సత్యం రామలింగరాజు కంపెనీల మాదిరి అదానీ కంపెనీల వ్యవహారం నకలుగా మారిందన్నారు. ఆర్థిక దుర్వినియోగానికి అదానీ సంస్థలు పాల్పడ్డాయని నిజమైన వ్యాపారాలు లేకుండానే ప్రజలను నమ్మించి మోసం చేశారని ఒక్క రోజే నాలుగు లక్షల కోట్ల రూపాయల మేర వివిధ సంస్థలు నష్టాన్ని చవి చూశాయని ఇందులో ఎస్ఐసి రూ.1800 కోట్ల మేర నష్టపోయిందని సాంబశివరావు తెలిపారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు కట్టబెట్టారని ఇప్పుడు ఈడి, సిబిఐ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా విచారణ జరిపించాలన్నారు. రేపు గాంధీజీ వర్థంతి అని ఈ సందర్భంగా లౌకిక వాదానికి మనమంతా పునరంకితం కావాలని కానీ బిజెపి గాంధీని కాదని గాడ్సేకు గుడికట్టే పనిలో ఉందన్నారు. ధర్మసంసద్ నిర్వహించిన మఠాధిపతులు భారతదేశ రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని చొప్పించాలని చూస్తున్నారని ఢిల్లీని కాదని వారణాసిలో రాజధానిని ఏర్పాటు చేయాలన్న అంశాన్ని కూడా చర్చలోకి తీసుకు వస్తున్నారని సాంబశివరావు తెలిపారు. విభిన్న సంస్కృతులు, సాంప్రదాయలు కలిగిన భారతదేశంలో ఏకమతం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టులుగా ఈ దేశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విచ్ఛిన్నం కానివ్వమని భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో కృషి చేస్తామన్నారు. మోడీపై కరణ్ణే రామ్, రాకేష్ శర్మ తదితరులు తీసిన డాక్యూమెంటరీని భారతదేశంలో ప్రచారం కానివ్వ కుండా అడ్డుకోవడం స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. తక్షణం మోడీపై తీసిన డాక్యుమెంటరీని ప్రసారం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. మిల్కినిభాను అత్యాచారం కేసులో 11 మందికి క్షమాభిక్షను కల్పించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ రంగాన్ని బతికించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. మోడీ హయాంలో ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. బిఆర్ఎస్లో అంశాల వారీ పొత్తు మాత్రమే ఉంటుందని పొత్తు పొత్తే పోరాటం పోరాటమేనన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే మౌనంగా ఉన్న అధికార యంత్రాంగం పేదలు అక్రమిస్తే అనవసర కేసులు పెడుతున్నారని 123 (బి) లాంటి కేసులు నమోదు చేయడం సహేతుకం కాదన్నారు. పోలీస్ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ఆలోచనలను, డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని, ఆర్టిసి, పోడు సమస్యలను కూడా పరిష్కరించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. డబ్బుతో అరాచకం సృష్టించాలనుకునే వారికి ప్రజలే తగు సమాధానం చెబుతారన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.